# కృష్ణ  కాళి

[కథానిక]

## శ్రీ లీలా మజుందార్

ఆనాడు సాయంకాలం క్షోణీపాతంగా వర్షం కురుస్తోంది. నిర్జనంగా ఉన్న ఆ రస్తామీద వాన నీరు సెలయేరుగా ప్రవహిస్తోంది. ఆకాశమంతా కారు మబ్బులు క్రమ్మినవి. రోడ్డు ప్రక్కనున్న నిద్రగన్నేరు మ్రానులనుండి వర్షపునీరు జలతారుతీగలవలె క్రిందకు జారుతోంది. ఆ చెట్లను దాటి ఇంకా దూరంలో ఆ పాతవడిన భస్మవర్ణపు భవనం కన్పిస్తూ ఉంటుంది.

ఆ యింటికి ముందు ధనురాకారంగా ఉన్న గోడకమానులమీద సువాసనలు వెదజల్లుచున్న పూల తీగెలు అల్లిబిల్లిగా అల్లుకొనియున్నవి. శిథిలములైన గోడలవెంట రావిచెట్టుకొమ్మలు ఆలింగనం చేసుకొన్నట్లుగా విస్తరించి ఉన్నవి. బావురుమని తెరచుకొనియున్న ద్వారములకుగాని, కిటికీలకుగాని తలుపులు లేవు. ఆ యింట్లో జనసంచారం ఉన్నట్లే కన్పించడం లేదు. అయితేనేమి? ఆ యిల్లు తలదాచుకొనుటకు తగిన తావుగానే కన్పించింది. ఈ గాలివానలో చిక్కుకొని ఒంటరిగా పోవుచున్న స్త్రీ తనకు ఆమాత్రపు నిలువనీడ లభించునని అనుకోకూడా లేదు.

ఈ భవనంలోని చలువరాతి మెట్లు వెనుకటి కాలంలో నడచినవారి కాళ్ళక్రింద చాలావరకు అరిగిపోయినవి. ఈ యింటి ఆవరణలో చలువరాతి స్త్రీ విగ్రహములను ఇదివర కెవ్వరో వరుసలుగా అమర్చి కొంత శృంగారం చేసిరి. రావిచెట్టుఆకులు గాలికి గలగలలాడుచు సొంపైన పేరు ఒకటి జపిస్తూన్నట్లుగా ఉంది. కాని అవి ఉచ్చరించెడి మనోహరమైన ఆ పేరు ఏమిటో ఎరుకపడుటలేదు.

ఆ చెట్టునిండా ఉన్న పచ్చని ఆకుల గుత్తుల మీద వర్షబిందువులు పడుతూఉంటే, నేను చూస్తూ ఉన్నాను. తలుపులేని ఆ విశాలమైన హాలులో ధూళి ధూసరితమైన కొమ్మల దీపపుసెమ్మె ఊగులాడుచు చేసే నీరవనిక్వణమును చూచి, అగోచరదివ్యమూర్తులు ఏవైనా ప్రత్యక్షమై జవాబు ఇచ్చునేమో అని అత్యంత ఆతురతతో ఎదురుచూస్తూ ఉన్నాను. కాని, అనేక పుష్కరాలనుంచీ జనసంచారచిహ్నములు లేని ఆ ధూళిరాసులనుండి వినిపించిన కంఠస్వరం ఏమీ లేదు.

వసారాగోడలకు అంటిపట్టుకొని బాగా పుష్పించిన ఆకాశమల్లి చెట్టు ఒకటి ఉన్నది. ఇంత పరిమళభరితమైన యీ ఆకాశమల్లి వెలసిన యీ భవనమును విడిచి యీ యింటివా రెట్లు వెళ్ళిపోయిరా యని ఆశ్చర్యచకితుడనైతిని. వసారాలో పిట్టగోడవలె అడ్డముగా నున్న, సగము విరిగిన యినుపకమ్మిపై నా చేతిని ఆనించి నిలవబడియుండగా అకస్మాత్తుగా సొగసైన రెండు కరకమలములు నాచేతికి చెంతనే వింతగా కన్పించెను. ఆ సొగసైన రెండుచేతుల వేళ్లు గులాబీరంగు లీనుచుండెను. ఒక వేలిపై కెంపుల ఉంగరం ఒకటి మెరుస్తూ ఉన్నది.

ఆశ్చర్యచకితుడనైతిని. నా కంటి కెదురైనది స్త్రీ రూప దివ్యలీలా సాక్షాత్కారము కాదనియు,

సజీవమైన మానవమూర్తియే యనియు గ్రహించితిని. ఆమె ఒగర్చుచు వేవేగముగా శ్వాస విడుచుచున్నప్పుడు విడివడి వ్రేలాడుచున్న ఆమె కురు లల్లాడుచుండెను. ఆమెకండ్లు కొంచెము తెల్లబారియుండెను. కాని వేగు చుక్కవలె తళతళలాడు చుండెను. వంచిన విల్లువలె తీర్చిన కనుబొమ్మల క్రిందనున్న నల్లని గ్రుడ్లకు అంచు వలె నున్న రెప్పలమీది వెంట్రుకలు నల్లని కాటుక రంగుతో పెంపెసలారుచుండెను. ఆమెముఖము సొగ సుగా, సొంపుగా నవ్వులొలుకుచున్నది. నాజూకైన ఆమెశరీరవైఖరి చూస్తే పాతికేండ్ల మనిషివలె నున్నది. లేత పచ్చనిరంగు చీర కట్టుకొనియున్నది. ముంజేతులకు బంగారు గాజులు, కంఠమందు కమ్మని వాసనలు వెద జల్లెడి చామంతి పూలదండ మనోహరముగా శోభించు చున్నవి.

"నాపేరు కృష్ణకాళి అంటారు. నాపేరు మీకు సొంపుగా ఉన్నదా?" అని ఆమె నన్ను అడిగింది.

"నీపేరు అందంగా ఉంది. నీవుకూడా అందం గానే ఉన్నావు" అని నేను అన్నాను.

ఆ మాటకు ఆమెకళ్లల్లో సంతోషం తొంగి చూచింది.

"నాతల వెంట్రుకలు ఎలా వంకరలు తిరిగినవో చూడండి; అవి నా మోకాళ్ల వరకు వ్రేలాడుచున్నవి. నాకంటె సొగసైనవా ళ్ళెవరైనా యీ ప్రాంతంలో ఉన్నారా? నా ఒంటి చాయ చూడండి. అంత పచ్చ బంగారమూ కాదు; కందగడ్డవలె ఎరుపూ కాదు." అని ఆమె అక్కడనే నిలవబడి నాతో అన్నది.

ఆమె తన మృదువైన చేతులు రెండూ విరిసిన తామరపూవులవలె పైకెత్తి "అరచేతులను పద్మములతో ఎందుకు పోలుస్తారో చూడండి. నా చేతి గోళ్ళు చూడండి-పండు దానిమ్మగింజలవలె మెరుస్తున్నాయి" అన్నది.

ఆ మాటలు ఆమె పల్కినదేకాని, నా జవాబు కొరకు ఆమె ఎదురుచూడలేదు. తన ధోరణిలో తాను సంభాషించుచునే యున్నది.

"చంద్రుని చక్కదనమును జ్ఞప్తికి తేగల ముఖము గలవారి నింకెవరినైనను మీరు చూచినారా? నిజంగా చెప్పండి" అన్నది.

నేను ఉన్నది ఉన్నట్లుగా నిజం చెప్పాను. "లేదు. ముమ్మాటికీ లేదు. ఇంతటి సౌందర్యరాశిని నా జీవితంలో ఎన్నడూ చూడలేదు" అన్నాను.

"ఈ జీవితంలో మాత్రమే చూడలేదంటారా?" అని ఆమె నిట్టూర్పు విడిచింది. "ఊర్వశి కనుబొమలు విల్లువలె యింత వంపుగా నా కనుబొమలవలె ఉన్న వంటారా? రంభకైన నువ్వుపువ్వువలె నా ముక్కు తీరు ఉన్నదంటారా? నేను తిలోత్తమకు సాటి అంద కత్తెనని మొగవాళ్ళు మెచ్చుకున్నారు. అందమైన వస్తువుల పొందికవల్ల నేను సృష్టి చేయబడ్డాను. అప రంజి, ముత్యాలు, వజ్రాలు, పరిమళపుష్పాలు, సూర్య కాంతి, ఆకాశంలోని నీలవర్ణం—అన్నింటినీ చేర్చి సృష్టించిన సౌందర్యం నాది. నిజంగా చెప్పండి. ఇంకో జన్మలోనైనా సరే, నాకంటే అందమైనదానిని మీరు చూడగలనని అనుకుంటారా?" అని అడిగింది. ఆమెకంఠస్వరంతో నా ఒళ్ళు పులకరించింది. ఆమె అడిగిన దానికి జవాబుగా యిలా అన్నాను: "సర్వాంగ సుందరమైన మనోహరరూపము ప్రతియుగములోను కన్పిస్తుందా? శతకోటి జన్మాలలో ఒక్కసారియైనను అటువంటి అందాలరాణిని చూడడంవల్ల జీవితం ధన్య మైనట్లే—నిత్యమైన బ్రహ్మానందపదవి లభించినట్లే."

నా మాటలకామె ఆనందపరవశురాలైంది. తన చేతులలో నన్ను కౌగిలించుకొన్నది. పట్టువలె మృదువైన ఆమెకురులు నా కంటికి అద్దుకొనినట్లయి నది. ఆమెమెడలోని పూలహారమునందొక పుష్పము నలిగి రెక్కలు వీడి నేలపై బడెను.

ఎందుచేతనోగాని, ఆమెముఖము అంతలో చింతాక్రాంత మయ్యెను. సూర్యుడస్తమించిన కొంత సేపటికి సంజకెంజాయలు అలముకొనినట్లయ్యెను. ఇంతకుపూర్వం ఆమెకంటిలో తళుకుమని మెరసిన వింతకాంతి యిప్పుడు లేదు. గుండెబరువుతో మాట లాడుచున్నట్లుగా కంఠస్వరము మారినది.

"కాని, ఒక్కటే ఒక్క లోటు ఉన్నది. భగవంతు డిచ్చిన సౌందర్య మేదో నాకు ఉన్నది. కాని ఆ భగవంతుడు నాకు హృదయ మనేది యివ్వ లేదు. హృదయము నిచ్చుటకు బదులుగా నున్నని రాతిగుండు నక్కడ పొందుపరచినాడు. కావలెనంటే ఇక్కడ చూడు. నా గుండెమీద చెయ్యిపెట్టి చూడు. ఆ గుండె కొట్టుకొనడం నీకు ఏమైనా వినిపించుచున్న దేమో చెప్పు" అన్నది.

కంపించి కంపించి కలవరింతగా పలుకుచున్న ఆమెమాటలను వినేసరికి, నిజంగా ఆమెరొమ్ముమీద చేయివేసి చూడగా ఆమెకు గుండెకాయ కొట్టుకొను చున్నట్లుగా నాకు కన్పించనేలేదు.

ఆమె నన్ను చూచి, "రాతిగుండు కొట్టుకొనునా? రాతికి ప్రేమరస ముండునా? నేను చిన్న పిల్లనై యుండినప్పుడు కూడ ముద్దు కొక పిల్లికూననైనను నా ఒడిలో కూర్చుండబెట్టుకోలేదు. చిన్న పిట్ట నైననూ చేతబట్టి మక్కువపడి దాని రెక్కలపై మునివ్రేళ్ళతో దువ్వియుండలేదు. నాకు ప్రేమఅనేది ఎవ్వరిమీదనూ ఇంతవరకూ లేదు. నా తండ్రిమీద, నా తల్లిమీదకూడా నాకు ప్రేమ అనేది లేదు." అన్నది.

బహుశః నా ముఖవైఖరిలో ఏదోమార్పు కన్పించింది. అందువలన ఆమె తత్తరపాటుతో నా చెయ్యి పట్టుకొని, "కాదు-కాదు. నీవు దురభిప్రాయపడవద్దు. నేను వాళ్ళని ప్రేమించలేదనే సంగతి వారి కెన్నడూ తెలియదు. వారికి ఒక్కగా నొక్క బిడ్డనైన నాకు హృదయ మనేది లేదని వారు స్వప్నంలోకూడా అనుకో లేదు. వారి యెడల నేను భక్తితాత్పర్యములతో, వినయ విధేయతలతోనే ఉండేదాన్ని" అన్నది.

కొంచెం సేపు ఆమె నిశ్శబ్దంగా నిలవబడి తిరిగి యిలా ప్రారంభించింది:

"నా పినతండ్రి కూతురైన మేఘమాలను శంకర దేవుకు యిచ్చి వివాహం చేయ నిశ్చయించారు. అతడు ఇదివర కొకసారి నన్ను చూచినాడు. ఆమెను పెండ్లిచేసికొనుటకు నిరాకరించాడు. సంబంధం నిశ్చయించుకొని పెద్దలందరూ ఆశీర్వాదం చేయవలసిన రోజు వచ్చింది. ప్రధానం చేసి తాంబూలాలు పుచ్చుకోవలసిన రోజున అతడు ఆ పిల్లను "పెండ్లి చేసుకోను" అన్నాడు. అటువంటిది ఎక్కడయినా జరుగునని అనుకుంటావా? తనకు ప్రధానం జరుగుతుందని మేఘమాల ఎదురుచూస్తోంది. తన నలుపు రంగు దేహాన్ని కప్పిపుచ్చుకుంటూ, నొసట మంచి గంధం అలముకొని చక్కని బనారసు సిల్కుచీర సింగారించి ఎదురుచూస్తోంది. కాని, ఏం లాభం? ప్రధానం జరుగనే లేదు."

ఆమె ఆ మాటలు అనగానే నాకు ఆశ్చర్యం కలిగి, "అయితే, నీవు అతనిని పెండ్లిచేసుకున్నావా ఏమిటి?" అన్నాను.

కృష్ణకాళి నావంక తేరిచూచి "అత డేమంత చక్కనివాడు? అతనికి ఉన్న గొప్ప సుగుణా లేమిటి? అత డేమైనా భాగ్యవంతుడా? ఆస్తిపరుడా? అతడు అటుపిమ్మట సన్యసించి ఎక్కడికో వెళ్లిపోయినాడు; ఎక్కడికి వెళ్ళిపోయినాడో నాకు గుర్తులేదు" అన్నది.

"అయితే, మేఘమాల?" అని నేను అడిగాను.

"మేఘమాల సంగతి ఏముంది? ఆమె ఎప్పుడో గతించినది" అని చెప్పి ఆమె కొంచెము ఆగి తిరిగి యిలా అంది:

"రారాజులంతటివాళ్ళు నన్ను వరించడానికి వచ్చారు. ఎర్రసిల్కు చీరనే సదా ధరించి వాళ్ళ నందరినీ నేను తిరస్కరించాను. కొందరు పరదేశాల పాలైనారు. కొందరు ఆత్మహత్యలు చేసుకొన్నారు. కొందరు మతదీక్షలు గైకొన్నారు. వారిలో ఎవరో కొద్దిమందిమాత్రము రోషంచేత సామాన్యమైన పిల్లలను పెళ్ళిచేసుకున్నారు. నన్ను వరించినవాళ్ళందరూ పట్టుపీతాంబరాలు, మేలైన ముత్యాలసరాలు వజ్రాల హారాలు నాకు కానుకలుగా తెచ్చియిచ్చారు. దీపక్ అనే ఒక కుర్రవాడుమాత్రము తాను పేదవాడగుటచేత నాకు పువ్వులు తెచ్చి సమర్పించాడు. ప్రతిరోజూ ఆ కుర్రవాడు నాకద్దకు వచ్చి "ఏమీ లేనివాడను నేను. నీకు నేను ఏ మివ్వగలను?" అని అంటూ ఉండేవాడు. అదంతా చూడగాచూడగా నాకు చీకాకు పుట్టింది. "నాకోసం నీవు మంచిముత్యాలు, అధరకాలు దొంగిలించి తీసుకొని రాలేకపోతే, నామీద

ప్రేమ ఉన్నదనే బడాయిమాటలు నాతో చెప్పవద్దు" అన్నాను. చివరకు ఆ కుర్రవాడు నిజంగా ఆప్రకారం గానే దొంగతనం చేశాడు. అతనిని పట్టుకొని జెయిలులో పెట్టినారు."

ఇదంతా చెప్పతూఉంటే నేను మౌనంగా వింటూఉన్నాను. అప్పుడు కృష్ణకాళి మెల్లిగా నా చెయ్యిపట్టుకొని ఊపి, "నా మనస్సులో ఉన్న సొద అంతా నేను చాలాకాలంవరకు ఎవరికీ చెప్పకోలేదు. నేటికి మీరు కన్పించారు.నుక నా మనస్సు హాయిగా ఉంది. మీరు కూర్చోండి. ఎక్కడ కూర్చుంటారు? ఇక్కడ నక్షి చెక్కిన కుర్చీలు ఉండేవి. అటువంటి చక్కని మా కుర్చీలన్నీ ఏమైనవో నాకు తెలియడం లేదు" అని కృష్ణకాళి ముగించింది.

"కృష్ణకాళీ, నీవు ఆందోళన పడవద్దు. నాకు ఇక్కడ సుఖంగానే ఉంది. ఇప్పుడు మనమిద్దరమూ చేరినాముగనుక, నీవు చెప్పదలచిన దేమిటో నాకు చెప్పు" అని ఆమెను కోరితిని.

"అయితే వినండి" అని చెప్పింది: "మాళవిక అనే అమ్మాయి నాకు ప్రియమైన స్నేహితురాలు. నాకోసం ఆమెభర్త ఆమెను విడిచిపెట్టినాడు. కాని అతనిని నేను స్వీకరించలేను. నేను ముచ్చులమారిదాని నని మాళవిక మొదట్లో నన్నుగూర్చి అన్నది. కాని ఆమె భర్తను నేను తిరస్కరించి పంపివేసినప్పుడు నేను చాలా క్రూరురాల నని ఆమె అన్నది. అనేక యుగాలనుంచిన్నీ నావంటి అందకత్తెలు సుఖంగా ఉన్న అనేకసంసారములను దగ్ధము చేశారు. నా తలి దండ్రు లెంత దుఃఖించారో నాకు తెలుసు. కాని వారు చిరకాలము యీ దుఃఖమును అనుభవించలేదు. మన పెద్దలందరూ ఏ కాలప్రవాహములో లీనమైనారో వారుకూడా అందులోనే లీనమై అంతర్ధానమైనారు. నేనుమాత్రం అపారఐశ్వర్యంతోను, పుష్పించిన సౌందర్యంతోను మిగిలియున్నాను చిట్టచివరకు యిన్నే ళ్ళయినతర్వాత నా జీవితచైతన్యమునకు సూర్యరశ్మి సోకింది. నా యౌవనవనంలో పక్షులు కిలకిల మన్నాయి. అంకురములు మొగ్గతొడిగి పుష్పించాయి. నా అంతరంగరహస్యగృహాంతరములోనికి అమితా భుడు ప్రవేశించాడు. ఒక్కక్షణంలో నా హృదయ స్థానంలో ఉన్న శిల కరిగి జలమైపోయింది.

అతనిని నేను పెళ్లిచేసుకున్నాను. ఏడే రోజులు అతనితో నేను దేవేంద్రభోగం అనుభవించాను. ఎని మిదో రోజున నేను నిద్రలేచి చూచేసరికి అమితాభుడు కన్పించలేదు. నా నగలు, ఆభరణాలు, వజ్ర వైడూర్య ములు తీసికొని అతడు పారిపోయినాడు. బంగారంతో నిండిన నాపెట్టె, నా ఖజానా అంతా నాకు యీ జీవి తంలో లేకుండా అదృశ్యమై పోయి వి. అప్పుడు నా హృదయం దహించుకొనిపోయి తపించి ఏడ్చింది. అప్పుడు మేఘమాలను, శంకరదేవును, దీపక్‌ను, మాళవి కను తలుచుకొని విలపించాను."

అని కృష్ణకాళి ముగించి పైమేడమీద కొంచెం పగిలియున్న ఒక ధనురాకారద్వారమును వేలుపెట్టి చూపించింది.

"అక్కడి నుండి నేను క్రిందకు పడితిని. ఆకాశ వల్లిపూలు కుప్పలుతిప్పలుగా పడియున్నచోట-ఇక్కడ క్రింద పడితిని. నా శరీరసౌందర్య మింకను వాడిపోలే దని నీ నోటితో అంటే వింటాను. నాకంటే అంద కత్తె లీలోకంలో ఉండరని నీవు అంటే చాలు. నీవు యీ జన్మలోగాని, యింకో జన్మలోగాని ఇంతటి సౌందర్యమును నేలమీద గాని, నీటిమీద గాని, ఆకా శంలో గాని ఏ యుగంలో నైనా చూచియుంటావా? చెప్పు; నిజంగా చెప్పు" అని ఆమె ఒక్క నిట్టూర్పు విడి చింది. తుపానుగాలి వీచినట్లుగా నిట్టూర్పు విడిచింది.

నాకు అప్పుడు ఆవేశంగా వచ్చిన ఆవేదనలో, "ఓ కృష్ణకాళీ! కృష్ణకాళీ! నీ వెవరు? నీ వెక్క డున్నావు?" అని అరచాను.

అప్పటికి వర్షం వెలిసింది. మేఘాలు విడిపోయి నాయి. అస్తమిస్తున్న సూర్యుని కాంతిపుంజములు దొడ్డి ఆవరణలోనికి చొచ్చుకొని వచ్చాయి. ఆ సువర్ణభాను దీప్తిలో ఇక నాకు కృష్ణకాళి కన్పించలేదు.

చెట్లకొమ్మల సందులనుండి వీచుచున్న గాలి మాత్రము నా చెవిలో గుసగుసలాడుచు "నేలమీదగాని, నీటిలోగాని, ఆకాశంలోగాని ఇటు వంటిసౌందర్య రాశి ఎక్కడవున్నదో నాకు చెప్పు" అని మెల్లిగా ధ్వనిస్తోంది.

---